ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
7 జిల్లా వార్తలు
బుధవారం 3 డిసెంబరు 2025


మొయినాబాద్ మండలం నాగిరెడ్డిగూడలో నామినేషన్ దాఖలు చేస్తున్న పద్మ

కమ్ముకున్న పొగమంచు



షాబాద్ మండల పరిధిలో పొగ మంచు కమ్ముకుంది. మంగళ వారం ఉదయం 9 గంటల వరకు దట్టమైన పొగ మంచు కురవడంతో వాహనదారులకు రహదారి కనిపించకపోవడంతో లైట్లు వేసుకొని వెళ్లారు. ఎదు రుగా వచ్చే వాహనాలు కనిపిం చక ఇబ్బందులు పడ్డారు. మంచు, చలి ప్రభావంతో వృద్ధులు, చిన్నారులు ఇళ్లకే పరిమితమయ్యారు.

- షాబాద్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి)

రెండో విడత నామినేషన్ల హోరు



ఇబ్రహీంపట్నం/చేవెళ్ల/ఆమనగల్లు, డిసెం బరు 2(ఆంధ్రజ్యోతి): రెండో విడత పంచా యతీ ఎన్నికల్లో మంగళవారం మూడో రోజు నామినేషన్ల పక్రియ చేవెళ్ల, కందుకూరు డివి జన్ల పరిధిలో ప్రశాతంగా ముగిసింది. చేవెళ్ల డివిజన్ పరిధిలోని చేవెళ్ల, షాబాద్, శంకర్‌పల్లి, మొయినాబాద్, కందుకూరు డివిజన్ పరిధిలోని ఆమన్‌గల్లు, కడ్తాల్, తలకొండపల్లి మండలాల్లో ఆయా గ్రామాల్లో సర్పంచ్, వార్డు సభ్యులు చివరి రోజు ఎక్కువ సంఖ్యలో నామినేషన్లు వేశారు. దీంతో గ్రామాల్లో సందడి నెలకొంది. జిల్లాలోని చేవెళ్ల, కందుకూరు డివిజన్‌లోని మొత్తం 178 సర్పంచ్ స్థానాలకు 528 మంది అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు. అలాగే 1,540 వార్డులకుగాను 2,301 మంది నామినేషన్లు వేశారు. ఆయా మండ లాల్లో ఎన్నికల అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవడంతో నామినేషన్ల ప్రక్రియ సాఫీగా ముగిసింది.

» 178 సర్పంచ్ స్థానాలకు 528 దాఖలు

రెండో విడత వచ్చిన నామినేషన్ల వివరాలు

మండలం	పంచాయతీలు	నామినేషన్లు	వార్డులు	నామినేషన్లు
చేవెళ్ల	25	73	218	267
షాబాద్	41	117	352	453
శంకర్‌పల్లి	24	45	210	202
మొయినాబాద్	19	53	166	323
ఆమనగల్లు	13	49	112	228
కడ్తాల్	24	75	210	387
తలకొండపల్లి	32	116	272	441
మొత్తం	178	528	1,540	2,301

నేటి నుంచి తుది విడత నామినేషన్లు

ఇబ్రహీంపట్నం డివిజన్‌లో 42 క్లస్టర్లు

174 పంచాయతీలు.. 1,598 వార్డులు

ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

ఇబ్రహీంపట్నం, డిసెం బరు 2(ఆంధ్రజ్యోతి): ఇబ్ర హీంపట్నం డివిజన్‌లోని మంచాల, యాచారం, ఇబ్ర హీంపట్నం, అబ్దుల్లాపూర్ మెట్, మాడ్గుల మండలాల తోపాటు కందుకూరు డివి జన్‌లోని మహేశ్వరం, కందుకూరు మండలాల్లో నేటి నుంచి మూడో విడత పంచాయతీ ఎన్నికల నామి నేషన్లు స్వీకరించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ ఏడు మండలాల్లో మొత్తం 174 పంచాయతీల్లో సర్పంచ్ అభ్యర్థులు, 1,598 వార్డు సభ్యులకు సంబంధించి నామినేషన్లు స్వీకరించనున్నారు. ఇబ్రహీంపట్నం డివిజన్ పరిధిలోని 42 క్లస్టర్లలో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇబ్రహీంపట్నం మండలంలో 5, అబ్దు ల్లాపూర్‌మెట్ 5, మాడ్గుల 12, మంచాల 9, యాచారం మండలంలో 10 క్లస్టర్లు ఏర్పాటు చేశారు. ఈ నెల 5 వరకు నామినేషన్లు స్వీకరి స్తారు. 6న పరిశీలన, 7న అభ్యంతరాల స్వీక రణ, 8న పరిష్కారం, 9న నామినేషన్ల ఉపసం హరణ, 17న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్, మధ్యాహ్నం 2 గంగంటల నుంచి కౌంటింగ్, అదేరోజు ఉప సర్పంచ్ ఎన్నిక ఉంటుంది.


ఇబ్రహీంపట్నంలో బ్యాలెట్ బాక్సులను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈవో క్రిష్ణారెడ్డి, మండల ప్రత్యేకాధిరి నవీన్‌కుమార్‌రెడ్డి


పొరపాట్లకు తావివ్వొద్దు

పొరపాట్లకు తావివ్వకుండా నామినేషన్లు స్వీకరించాలని జెడ్పీ సీఈవో కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయంలో ఆర్వోలు, ఏర్వోల శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, అభ్యర్థులకు గుర్తులు కేటాయించే వరకు ఎన్నికల కమిషన్ నిబంధన మేరకు నడుచుకోవాలని సూచిం చారు. నామినేషన్ల సామగ్రిని పరిశీలించారు. కాగా, నామినేషన్ పత్రాలు, సామగ్రితో ఆర్వోలు, ఏర్వోలు క్లస్టర్లకు చేరుకున్నారు. ఈ శిక్షణలో మండల ప్రత్యేకాధికారి నవీన్‌కుమార్ రెడ్డి, ఎంపీడీవో వెంకటమ్మ, సూపరిండెంట్ జంగయ్యగౌడ్, ఎంపీవో ఉష పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



ఇబ్రహీంపట్నం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని ఖానా పూర్ గ్రామంలోని సర్వే నం.80లోని ప్రభుత్వ భూమిలో చేపట్టిన నిర్మాణాలను మంగళ వారం తెల్లవారుజామున రెవెన్యూ అధికారులు కూల్చి వేశారు. ఇక్కడ ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కళా శాల నిర్మాణాలు చేపట్టింది. రెవెన్యూ ఇన్‌స్పె క్టర్ సువర్ణ, సర్వేయర్ సాయికృష్ణారెడ్డి, గ్రామ పాలనాధికారులు శ్రీనివాస్, రాజు, మణికుమార్, వీఆర్‌ఏ మహేశ్ దగ్గరుండి అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు.



గ్రామగ్రామాన ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. పంచాయ తీల్లో సర్పంచ్‌గా పట్టు నిలుపుకునేందుకు అభ్యర్థులు నానా తంటాలు పడుతున్నారు. ఓటర్లను ప్రసనం చేసుకునేందుకు హామీల వర్షం కురిపిస్తున్నారు. పగలంతా ప్రచారం చేస్తూ రాత్రి అయ్యిందంటే దావతులు ఇస్తూ మద్దతుదారులను కాపాడుకునే పనిలో పడ్డారు. హైదరాబాద్, తదితర చోట్ల ఉన్న ఓటర్లకు ఫోన్లు చేసి గ్రామాలకు రప్పిస్తున్నారు. దీంతో గ్రామాల్లో ఎన్నికల హడావుడి నెలకొంది.

పల్లెల్లో ప్రచార జోరు!

- పొద్దంతా ప్రచారం.. రాత్రయితే దావతులు!
- రెండు విడతల్లో పలు పంచాయతీలు ఏకగ్రీవం
- ఓట్ల కోసం పట్టణాల నుంచి పల్లెలకు చేరుతున్న జనం
- మద్యం, మాంసానికి ఫుల్ డిమాండ్

ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో అభ్యర్థులు

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మొత్తం 21 మండలాలకుగాను ఇప్పటికే షాద్‌న గర్ డివిజన్‌లో కొత్తూరు, నందిగామ, కేశంపేట్, కొందుర్గు, చౌదరిగూడ, ఫరూఖ్‌నగర్, రాజేంద్రనగర్ డివిజన్ లోని శంషాబాద్ మండలంలో మొదటి విడతగా ఏడు మండలాల్లో 174 పంచాయతీలకుగాను ఐదు పంచాయ తీలు కన్హాశాంతివనం, దేవునిబండ తండా, చెరుకుపల్లి, పాత ఆగిర్యాల, లక్ష్మీదేవిపల్లి పంచాయతీ సర్పంచులు, వార్డు సభ్యులు ఏకగ్రీవమైన సంగతి తెలసిందే. మిగిలిన 169 పంచాయ తీల్లో సర్పంచ్, వార్డు స్థానాలకు నామి నేషన్లు వేయగా పరిశీలన పూర్తయి చెల్లుబాటైన అభ్యర్థుల జాబితాను అధి కారులు ప్రకటించారు.

➡ రెండో విడతలో మరో ఏడు మండ లాల్లో అంటే చేవెళ్ల డివిజన్‌లోని శంక ర్‌పల్లి, మొయినాబాద్, చేవెళ్ల, షాబాద్, కందుకూరు రెవెన్యూ డివిజన్ పరిధి ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి మండలాల్లోని 178 పంచాయతీల్లో నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతుం డగా కడ్తాల్ మండలం గోవిందాయి పల్లి తండా పంచాయతీ ఏకగ్రీవ మైంది. ఇప్పటికే పలు పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి.

➡ ఇబ్రహీంపట్నం రెవెన్యూ డివిజన్ లోని ఏడు మండలాలు అబ్దుల్లాపూర్ మెట్, ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం, మాడ్గుల మండలాలు, కందుకూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో కందుకూరు, మహేశ్వరం మండలాల్లో

మిగతా 10వ పేజీలో...

అంగబలం, అర్థబలమే అర్హతగా..

ఈ ఎన్నికల్లో అంగబలం, అర్థబలం, ప్రజల్లో పలుకుబడి ఉన్న అభ్యర్థులనే ఆయా పార్టీలు సర్పంచ్ అభ్యర్థులుగా రంగంలో దించుతున్నాయి. ప్రధాన పార్టీల నుంచి పలు చోట్ల రియల్ ఎస్టేట్ వ్యాపా రులు, వారి కుటుంబ సభ్యులు పోటీ పడుతున్నారు. కొన్ని చోట్ల పంచాయతీ ఎన్ని కల్లో పోటీకి ఆశలు పెట్టుకుని రిజర్వేషన్లు కలిసిరాకపోవ డంతో తమ మద్దతుదారు లను రంగంలో దించుతు న్నారు. ఈ ఎన్నికల్లో విద్యాధి కులు ముఖ్యంగా మహిళలు ఆయా పంచాయతీల నుంచి పోటీ పడుతున్నారు. పార్టీ గుర్తులు లేకపోయినా ఈ ఎన్నికలను ప్రధాన పార్టీలు సవాల్‌గా తీసుకుంటూ సర్వశ క్తులు ఒడ్డుతున్నాయి. గిరిజన తండాలు ఎక్కువగా ఉన్న మంచాల, యాచారం, ఆమన గల్లు, కొందుర్గు లాంటి మండ లాల్లో ఈసారి ఎన్నికలు గతా నికి భిన్నంగా రసవత్తరంగా జరుగుతున్నాయి. పనుల కోసం హైదరాబాద్ మహాన గరం తదితర చోట్లకు వెళ్లి అక్కడే ఉంటున్న వారు ఓట్ల కోసం పల్లెలకు చేరుకుంటు న్నారు. దీంతో గ్రామాల్లో సందడి నెలకొంది.

కోడలికే కోనాపూర్..

ఆమనగల్లు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనాపూర్ సర్పంచ్‌గా బెల్లంకొండ శ్రీలత ఏకగ్రీవమయ్యారు. మంగళవారం వరకు శ్రీలత ఒక్కరే నామినేషన్ వేశారు. రిజర్వేషన్లలో భాగంగా కోనాపూర్ సర్పంచ్ పదవి ఎస్టీ మహిళలకు కేటాయించారు. గ్రామంలో ఉన్న ఒకే ఒక ఎస్టీ(ఎరుకల) కుటుంబమైన బెల్లంకొండ రాముల్లమ్మ ఆమె కుమారుడు బెల్లంకొండ సైదులు, కోడలు శ్రీలత ఓటర్లుగా ఉన్నారు. 2013లోనూ సర్పంచ్ స్థానాన్ని ఎస్టీ మహిళకు రిజర్వ్ చేయడంతో అత్త బెల్లంకొండ రాములమ్మ సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైంది. కోనాపూర్ సర్పంచ్‌గా అత్తా.. కోడలా.. అని నవం బరు 26న ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. కోనాపూర్‌లో 1,125 మంది ఓటర్లకు 541 మంది పురుషులు, 584 మంది స్త్రీలు ఉన్నారు.

ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

» పంచాయతీ ఎన్నికల అబ్జర్వర్ ప్రశాంత్ జీవన్ పాటిల్


మాట్లాడుతున్న ఎన్నికల అబ్జర్వర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, కలెక్టర్ నారాయణరెడ్డి

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలని పంచాయతీ ఎన్నికల అబ్జర్వర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ అన్నారు. పంచాయతీ ఎన్నికల నేప థ్యంలో పోలింగ్ సిబ్బందికి రెండో విడత ర్యాండ మైజేషన్ ప్రక్రియను మంగళవారం జిల్లా ఎన్ని కల అధికారి, కలెక్టర్ సి.నారాయణరెడ్డి సమ క్షంలో నిర్వహించారు. కలెక్టరేట్‌లో జిల్లాలోని రెవెన్యూ డివిజన్ పరిధిలో ఒక్కో మండలం వారీగా ఆయా గ్రామాల పంచాయతీల సర్పంచ్, వార్డు స్థానాలకు ఎన్నికల పోలింగ్ విధులు నిర్వ హించే ప్రిసైడింగ్ అధికారులు, ఓపీవోలను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. జిల్లా లోని 526 గ్రామ పంచాయతీలకు సర్పంచ్, 4,668 వార్డు స్థానాలకు ఎన్నికల నిర్వహణ కోసం 20 శాతం రిజర్వు సిబ్బందిని కలుపుకొని ప్రిసైడింగ్ అధికారులతోపాటు ఓపీవోల ర్యాండ మైషన్ నిర్వహించారు. అనంతరం పోలింగ్ సిబ్బంది శిక్షణ కార్యక్రమంలో ప్రిసైడింగ్ అధికా రులు అన్ని విషయాల్లో అప్రమత్తంగా ఉండా లని, పొరపాట్లకు తావివ్వొద్దన్నారు. రీపోలింగ్‌కు ఆస్కారం లేకుండా విధులు నిర్వహించాలని జనరల్ అబ్జర్వర్ సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, జెడ్పీ సీఈవో కృష్ణా రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి సురేష్‌మోహన్, నోడల్ అధికారి శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీల్లో దీక్షిత్ ప్రతిభ



కడ్తాల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో కడ్తాల విద్యార్థి దీక్షిత్ ప్రతిభ కనబరి చాడు. 8వ తెలంగాణ రాష్ట్ర జూని యర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ వాలీబాల్ చాంపియన్ షిప్ 2025-26 టోర్న మెంట్ పోటీలు రాజన్న సిరిసిల్ల జిల్లాలో తెలంగాణ వాలీబాల్ అసో సియేషన్, రాజన్న సిరిసిల్ల వాలీబాల్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వ ర్యంలో నవంబర్ 29 నుంచి డిసెం బర్ 2వ తేదీ వరకు నిర్వహించారు. ఈ పోటీల్లో కడ్తాలకు చెందిన దీక్షిత్ రంగారెడ్డి జిల్లా జట్టు తరపున పాల్గొని ప్రతిభ కనబరిచాడు. గెలు పొందిన దీక్షిత్‌కు మెడల్, ప్రసంశా పత్రాన్ని అందజేసి అభినందించారు.

పంచాయతీ ఎన్నికల్లో విద్యావంతులు

పోటీలో చార్టెడ్ అకౌంటెంట్లు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, హోంగార్డులు

9

ధాన్యం.. దైన్యం

మూడు రోజులుగా నిలిచిపోయిన తూకాలు

కొనుగోలు కేంద్రాల వద్ద రైతుల ఎదురుచూపులు

ధాన్యం కుప్పలతో నిండిపోయిన మార్కెట్ యార్డ్

గన్నీ బ్యాగుల కొరతతో నిలిచిన కొనుగోళ్లు


ఆమనగల్లు మార్కెట్‌లో నిండిపోయిన ధాన్యం కుప్పలు

ఆమనగల్లు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): కాలమేదైనా రైతులకు కష్టాలు తప్పడం లేదు. ఈ ఏడాది వరి దిగుబడి ఆశాజనకంగా లేదు. వచ్చిన కొద్దిపాటి పంటను విక్రయించడానికి రైతులు నానా తంటాలు పడాల్సి వస్తోంది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల వద్దకు ధాన్యం తెస్తే తేమ శాతం ఎక్కువగా ఉందని తిరస్కరిస్తున్నారు. దీంతో తప్పని పరి స్థితుల్లో మార్కెట్ యార్డ్‌లలోనే రోజుల తర బడి ధాన్యాన్ని ఆరబెడుతున్నారు. కాగా, గన్నీ బ్యాగ్‌ల కొరత రెతులను వెంటాడుతోంది.

మూడు రోజులుగా కొనుగోళ్లు బంద్

ఆమనగల్లు మార్కెట్ యార్డ్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో మూడు రోజులుగా

మిగతా 10వ పేజీలో...

పక్షం రోజులుగా ఎదురుచూస్తున్నా..



పక్షం రోజుల క్రితం ధాన్యాన్ని మార్కెట్ యార్డ్‌కు తీసుకువ చ్చాను. తేమ శాతం ఎక్కువగా ఉందని కొనుగోలు చేయలేదు. దీంతో మార్కెట్ యార్డ్‌లోనే ధాన్యాన్ని అర బోశా. వారం క్రితం తేమ శాతం వచ్చినా గన్నీ బ్యాగులు లేక తూకాలు వేయడం లేదు. బ్యాగులు త్వరగా తెప్పించి తూకాలు వేసి ఇబ్బందులు తీర్చాలి.

- రూపం వెంకట్ రెడ్డి, రైతు - చింతలపల్లి

విమానంలో ప్రయాణికురాలికి అస్వస్థత

శంషాబాద్ రూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): భువనేశ్వర్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు ఇండిగోలో వస్తున్న జాష్ నంది దేబోశ్రీ(40) అస్వస్థతకు గురయ్యారు. గమనించిన తోటి ప్రయాణికులు సిబ్బందికి సమా చారమిచ్చారు. సాయంత్రం ఎయిర్‌పో ర్టులో ల్యాండైన వెంటనే ఎమర్జెన్సీ మెడి కల్ సిబ్బంది ఆమెను ఎయిర్‌పోర్టులోని అపోలో ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స నిర్వహించి అనంతరం మెరుగైన వైద్యం కోసం జూబ్లీహిల్స్‌లోని అపోలో ఆస్పత్రికి తరలించారు.

రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి

కందుకూరు, డిసెబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని మీర్ఖాన్‌పేట, ఆకులమైలారం గ్రామాల నుంచి ఫోర్త్ సిటీ వరకు గుంతలమ యమైన రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలని స్థానిక నాయకులు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు విన్నపించారు. మంగళవారం గ్లోబల్ సమ్మిట్ పనును పర్యవేక్షించేందుకు వచ్చిన మంత్రి శ్రీధర్‌బాబుకు స్థానిక నేతలు చిర్ర సాయిలు, గండు నర్సింహ, డేరంగుల నర్సింహ, మదన్‌పాల్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి కలి శారు. గతేడాది నుంచి తమ గ్రామాలకు వెళ్లా లంటే ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. స్పందించిన మంత్రి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి రోడ్డు పనులను ప్రారంబిం చాలని ఫ్యూచర్ సిటీ అథారిటీ ఎండీ శశాంకకు సూచించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి ఏనుగు జంగారెడ్డి, సభ్యులు దేప భాస్కర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ ఎస్.కృష్ణానాయక్, మాజీ జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి పాల్గొన్నారు.


మంత్రి శ్రీధర్‌బాబుకు విన్నవిస్తున్న నాయకులు

రూ.3.25కోట్లతో మేడ్చల్ పెద్దచెరువు పనులకు శ్రీకారం


డీఈ విజయలక్ష్మికి వర్క్ ఆర్డర్ అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మేడ్చల్ టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మురుగు నీటితో కలుషితమైన మేడ్చల్ పెద్ద చెరువును సురక్షితం చేసేందుకు జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ తరఫున రూ.3.25కోట్లు మంజూరు చేశారు. మంగళవారం కాంగ్రెస్ నాయకులు వేముల శ్రీనివాస్‌రెడ్డి, మర్రి నర్సింహారెడ్డిలు ప్రభుత్వ ఉత్తర్వుల కాపీని మున్సిపల్ కమిషనర్ చంద్రప్రకాశ్‌రెడ్డి, డీఈ విజయలక్ష్మిలకు అందజేశారు. కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. పెద్ద చెరువులో మురుగు కాలువలు కలవటంతో నీరు కలుషితమైందన్నారు. చెరువులో కలుస్తున్న మురుగు కాలువల దారి మళ్లింపుపై ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయగా ప్రస్తుతం రూ.3.25కోట్లు మంజూరు చేశారన్నారు. ఈ నిధులతో చెరువులో కలుస్తున్న మురుగు కాలువలకు కొత్త డ్రైనేజి పైప్‌లైన్ నిర్మించి మురుగు నీరు దూర ప్రాంతాలకు తరలిస్తారన్నారు. ఈ పనులు వేగవంతంగా పూర్తయ్యేలా అధికారులు కృషిచేయాలన్నారు. చేపట్టే పనుల్లో భాగంగా ప్రస్తుతం డ్రైనేజీ పైప్‌లైన్లను తెప్పిస్తున్నామని వారు తెలిపారు. చెరువు పరిసర ప్రాంతాల్లో కొత్త కాలనీలు తమ మురుగు నీటిని చెరువులోకి మళ్లించకుండా పటిష్టమైన డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. పెద్ద చెరువును కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో మల్లేష్‌గౌడ్, డి.లింగం, దేవరాజ్, కౌడె మహేష్ పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీలో తుక్కుగూడ విలీనం సరికాదు

- తుక్కుగూడ పొలిటికల్ జేఏసీ నాయకుడు లక్ష్మణ్


తుక్కుగూడలో సమావేశమైన పొలిటికల్ జేఏసీ నాయకులు

మహేశ్వరం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): తుక్కుగూడ మున్సిపాలిటీని జీహెచ్ఎంసీలో విలీనం చేస్తున్నట్లు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నామని, ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా ప్రభుత్వం తాను తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని తుక్కుగూడ రాజకీయ పార్టీల జేఏసీ నాయకులు నర్సింహారెడ్డి, రచ్చ లక్ష్మణ్, వెంకట్‌రెడ్డిలు మండిపడ్డారు. తుక్కుగూడను పురపాలికను జీహెచ్ఎంసీలో విలీనం చేయడాన్ని వ్యతిరేకిస్తూ బుధవారం రాజకీయ జేఏసీ నాయకుల సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. తుక్కుగూడ మున్సిపాలిటీని చార్మినార్ జోన్‌లో కలిపితే అభివృద్ధికి ఆటంకం కలుగుతుందన్నారు. అదే విధంగా శాంతి భద్రతలు కూడా దెబ్బతింటాయన్నారు. ఈ విషయంపై కలెక్టర్‌ను సైతం కలిసి వినతి పత్రం అందజేశామన్నారు. రాష్ట్రంలోని కొన్ని కార్పొరేషన్లు, మునిసిపాలిటీలను జీహెచ్ఎంసీలో విలీనం చేసిందని, తుక్కుగూడ సైతం రింగు రోడ్డు పరిధిలో ఉందన్న కారణంతో జీహెచ్ఎంసీలో కలుపుతూ నిర్ణయం తీసుకుందన్నారు. ఐతే ప్రజలు వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయాన్ని విరమించుకోకుంటే ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు.

కాంగ్రెస్ బెదిరింపులకు భయపడం


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి, పాల్గొన్న పార్టీ నాయకులు

తాండూరు రూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థులను తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి బెదిరింపులకు పాల్పడుతూ ఆయన అనుచరులు దౌర్జన్యాలు చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం తన క్యాంప్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. ఈ ఎన్నికల్లో ఎమ్మెల్యే అనుచరులు గుండాల్లా వ్యవహరిస్తున్నారని అన్నారు. పార్టీలకతీతంగా ఎన్నికలు జరుగుతుంటే వారికి బలవంతంగా కాంగ్రెస్ కండువాలు కప్పి అరాచకం చేసి తమ అభ్యర్థులుగా ప్రకటించుకుంటున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి మద్దతివ్వకుంటే సంగతి చూస్తామని భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. లక్ష్మీనారాయణపూర్, మంతన్‌గౌడ్ సర్పంచ్‌లను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకున్నారని తెలిపారు. బలం నిరూపించుకోవాలంటే తాండూరు అభివృద్ధిపై చర్చకు రావాలన్నారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి గ్రామాల పేర్లు కూడా తెలియదన్నారు. 42శాతం బీసీలకు పోటీకి అవకాశం కల్పిస్తానని కాంగ్రెస్ మోసం చేసిందన్నారు. మీడియాపై సైతం ఆ పార్టీ నాయకులు దౌర్జన్యాలు చేస్తున్నారని వాపోయారు. కొత్లాపూర్‌నకు చెందిన రాములును కాంగ్రెస్ నాయకులు బెదిరించారన్నారు. బీఆర్ఎస్ నాయకుల జోలికొస్తే ఖబడ్దార్ అని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు నర్సిములు, నరేందర్‌గౌడ్, తాండూరు, యాలాల, పెద్దేముల్, బషీరాబాద్ మండలాల అధ్యక్షులు వీరేందర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్, నర్సిరెడ్డి ఉన్నారు.

ఆలయ అభివృద్ధికి సహకరిస్తా


అభయాంజనేయాలయంలో పూజలు నిర్వహిస్తున్న మహేందర్‌రెడ్డి

తాండూరు రూరల్, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంతారం గ్రామంలో అభయాంజనేయస్వామి ఆలయాన్ని పునర్నిర్మించడం సంతోషకరం అని ప్రభుత్వ చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం అజనేయస్వామి ఆలయాన్ని సందర్శించి పూజలు చేశారు. తాను మంత్రిగా ఉన్న సమయంలో నియోజకవర్గంలోని ఆలయాలకు ఆర్థిక సహాయం అందించానని, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. గ్రామాల్లో సదుపాయలకు కోట్లాది రూపాయలు వెచ్చించామని అన్నారు. ప్రసుత్తం ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు పురుషోత్తంరావు, వడ్డె శ్రీనివాస్, గ్రామస్తులు ప్రభాకర్‌రెడ్డి, వెంకటచారి శుక్రవార్, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

కొలువుదీరిన మార్కెట్ కమిటీ పాలకవర్గం


స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను కలిసి సత్కరిస్తున్న పాలకవర్గ సభ్యులు

వికారాబాద్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): వికారాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం కొలువుదీరింది. మంగళవారం పాలకవర్గం చైర్మన్, వైస్‌చైర్మన్ సభ్యులు బాధ్యతలు స్వీకరించారు. మార్కెట్ చైర్మన్‌గా శ్రీనివాస్, వైస్‌చైర్మన్‌గా మల్లేశం, సభ్యులుగా పాపిరెడ్డి, రమేష్, రాజు, అర్చన, భీమయ్య, విజేందర్‌రెడ్డి, పాండురంగారెడ్డి, నాగిరెడ్డి, రంగారెడ్డి, ప్రభాకర్, నర్సింలు, సురేందర్ బాధ్యతలు చేపట్టారు. అనంతరం వారు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను కలిశారు. చైర్మన్ మాట్లాడుతూ.. రైతుల సంక్షేమానికి కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, ఆర్టీఏ మెంబర్ ఎర్రవల్లి జాఫర్, మాజీ జెడ్పీటీసీలు మహిపాల్‌రెడ్డి, ముత్తహర్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

విమానంలో సాంకేతిక లోపం ...

- గంటపాటు ఎయిర్‌పోర్టులో ప్రయాణికుల పడిగాపులు

శంషాబాద్ రూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ఢిల్లీ వెళ్లాల్సిన విమానంలో సాంకేతిక లోపం తలెత్తింది. ప్రయాణికులు గంటకుపైగా ఎయిర్‌పోర్టులోనే పడిగాపులు కాశారు. వివరాలిలా ఉన్నాయి. శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి 6ఈ 240 ఇండిగో విమానం 206మంది ప్రయాణికులతో ఉదయం 10.30 గంటలకు బయలుదేరాలి, టేకాఫ్ సమయంలో బే నెం:48 వద్ద సాంకేతిక లోపం తలెత్తింది. పైలెట్ ఏటీసీ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. సాంకేతిక నిపుణులొచ్చి గంటకుపైగా శ్రమించి సమస్యను తీర్చారు. అధికారులతో ప్రయాణికులు వాగ్వాదానికి దిగారు. సమస్య సరిచేసిన అనంతరం విమానం 11.38గంటలకు ఢిల్లీకి వెళ్లింది.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



మేడ్చల్ టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నియంత్రణకు వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని మేడ్చల్ ట్రాఫిక్ సీఐ మధుసూదన్‌రావు అన్నారు. స్ఫూర్తి జూనియర్ కళాశాలలో మంగళవారం ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తిట్టాడని అంతమొందించారు

- వృద్ధుడిని హత్య చేసిన పక్కింటి యువకులు ..


హత్యకు గురైన సౌదయ్య

శంషాబాద్ రూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): తిట్టాడని వృద్ధుడిని దారుణంగా హత్య చేశారు ఇద్దరు యువకులు. ఈ ఘటన శంషాబాద్ మండలం ఆర్జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ బాల్‌రాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపల్ పరిధిలోని సిద్ధాంతి బస్తీలో ఉండే సౌదయ్య(70), భారతమ్మ దంపతులు. సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని యువకులిద్దరు సౌదయ్య తలపై బండరాయితో మోది హత్య చేసినట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కొద్ది రోజుల క్రితం తమను తిట్టాడని పక్కింటి యువకులు పగ పెంచుకుని హత్యచేసి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రిలో పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. సౌదయ్యకు భార్య తప్ప ఎవరూ లేరు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. భర్త హత్యకు గురికావడంతో వృద్ధురాలు భారతమ్మ బోరున విలపించింది.

క్రైస్తవ సత్కారానికి దరఖాస్తుల ఆహ్వానం

మేడ్చల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం క్రిస్మస్ వేడుకలు-2025 కార్యక్రమాల్లో భాగంగా ఎంపిక చేసిన అర్హులైన అభ్యర్థులు, సంస్థలను గౌరవించి సత్కరించాలని నిర్ణయించినట్లు జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి కాంతమ్మ మంగళవారం తెలిపారు. అర్హులైన క్రైస్తవ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. 2025 వేడుకల నాటికి కనీసం 25ఏళ్ల పాటు ఆరోగ్య, విద్య, సామాజిక సేవా రంగాల్లో సేవ చేయాల్సి ఉంటుందన్నారు. అభ్యర్థులు, సంస్థలు తమ నామినేషన్లను ఈ నెల 6 వరకు అందజేయాలన్నారు.

ఇన్‌చార్జి పీఆర్వోగా బాలేశ్వరి


కలెక్టర్ నారాయణరెడ్డిని కలిసి పూల మొక్కను అందజేస్తున్న బాలేశ్వరి

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): జిల్లా పౌర సంబంధాల అధికారిగా అడిషనల్ పీఆర్వో బి.బాలేశ్వరి మంగళవారం బాధ్యతలు తీసుకున్నారు. డీపీఆర్వోగా పనిచేసిన వెంకటేశం నవంబరు 30న ఉద్యోగ విరమణ చేయడంతో ఈ పోస్టు ఖాళీ అయింది. దీంతో ఇన్‌చార్జి డీపీఆర్వోగా బాధ్యతలు తీసుకున్న బాలేశ్వరి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు.

వడ్ల కొనుగోళ్లలో ఇబ్బందులు పెట్టొద్దు


సుల్తాన్‌పూర్ కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న లింగ్యానాయక్

పరిగి,డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): వడ్లు తెచ్చే రైతులను ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. మంగళవారం సుల్తాన్‌పూర్, రంగంపల్లి, గడిసింగాపూర్‌లలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. నిర్వాహకులు, రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. సెంటర్లకు వచ్చిన ధాన్యాన్ని ట్యాగింగ్ చేసి, వెంటనే మిల్లులకు తరలించాలని సూచించారు. రైతులు పండించిన ధాన్యం మొత్తం ప్రభుత్వమే కొంటుందన్నారు. సంచులను కూడా సెంటర్లలో అందుబాటులో ఉంచామని తెలిపారు. వడ్ల తరలింపునకు లారీలు అందుబాటులో ఉంచామని చెప్పారు. రైతుల పట్ల నిర్లక్ష్యం చేయరాదని సూచించారు.

కార్మికులకు కనీస వేతనం చెల్లించాలి


ప్రభుత్వాసుపత్రి వద్ద ఆందోళన నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు

ఘట్‌కేసర్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాసుపత్రుల్లో పనిచేస్తున్న శానిటేషన్, పేషెంట్ కేర్ టేకర్, సెక్యూరిటీ తదితర రంగాల్లో పనిచేస్తున్న కార్మికులందరికి కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని రాష్ట్ర మెడికల్, కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సంఘం రాష్ట్ర నాయకుడు కల్లూరి జయచంద్ర డిమాండ్ చేశారు. మంగళవారం కార్మికులు ఆందోళన నిర్వహించి సూపరిండెంట్‌కు వినతి పత్రం అందజేశారు. జయచంద్ర మాట్లాడుతూ.. ఆసుపత్రుల్లో కాంట్రాక్టర్ల కాలపరిమితి ముగిసినందున కొత్త టెండర్లను పిలవాలన్నారు. నూతన టెండర్లలో కార్మికులకు రూ.26వేల కనీస వేతనం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నెల 5న కోఠిలోని మెడికల్ అండ్ హెల్త్ డిపార్టుమెంట్ కార్యాలయం వద్ద ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. లొట్టి ఈశ్వర్, కార్మికులు పాల్గొన్నారు.

సీఐఎస్ఎఫ్ సిబ్బంది విధుల పొడిగింపు

శంషాబాద్ రూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పార్లమెంట్‌లో సీఐఎస్ఎఫ్ సిబ్బంది విధులను మరో ఏడాది పొడిగించడంతో శంషాబాద్ ఎయిర్‌పోర్టు సీఐఎస్ఎఫ్ డీఐజీ ఎస్కే.మోహంకా మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. ఆయన డీఐజీ మాట్లాడుతూ.. దేశానికి గుండెకాయ లాంటి పార్లమెంట్ భద్రతలో సీఐఎస్ఎఫ్ పాత్ర కీలకం అన్నారు. 2023 డిసెంబరు సంఘటన తరువాత చేపట్టిన సమగ్ర భద్రతా సమీక్షలో ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్(సీఐఎస్ఎఫ్) పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్ భద్రత బలోపేతానికి కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లోని అన్ని స్థాయిల భద్రతను సీఐఎస్ఎఫ్‌కు అప్పగించిందన్నారు. గతంలో సీఐఎస్ఎఫ్ సిబ్బంది ఉద్యోగ కాలం మూడేళ్లు ఉండేదని, ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం మూడేళ్ల నుంచి నాలుగేళ్లకు పెంచిందని పేర్కొన్నారు.

మహిళా సాధికారతకు ప్రభుత్వం కృషి



ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని సాంఘిక సంక్షేమ శాఖ ఆర్మీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీలత అన్నారు. అంకుషాపూర్‌లోని తెలంగాణ సంక్షేమ ఆర్మీ డిగ్రీ కళాశాలలో మంగళవారం 'మహిళా సాధికారత సాధన' అంశంపై ఒకరోజు సెమినార్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఐసీఎం ప్రతినిధులు పాల్గొన్నారు.

అక్షరమాల ప్రకారమే
గుర్తుల కేటాయింపు





కొత్తూర్, డిసంబరు 2(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో భాగంగా సర్పంచ్, వార్డు పదవుల అభ్యర్థులకు తెలుగు అక్షరమాల ప్రకారమే ఎన్నికల అధికారులు గుర్తులు కేటాయిస్తారు. మొదటి విడత ఎన్నికలకు నామినేషన్ వేసిన వారు బుధవారం మధ్యాహ్నం 3గంటల్లోపు నామినేషన్ విత్‌డ్రాకు అవకాశం ఉంది. దీంతో మూడు గంటల తర్వాత ఎన్నికల్లో పోటీలో ఉండే అభ్యర్థుల పేర్లను అధికారులు ప్రకటిస్తారు. ఈ ప్రకారం అభ్యర్థులకు తెలుగు అక్షరమాల ప్రకారం ఎన్నికల గుర్తులను కేటాయిస్తారు. అభ్యర్థులు నామినేషన్ పత్రంలో మొదట ఏ అక్షరం రాస్తారో.. దాన్ని బట్టి గుర్తులు కేటాయిస్తారు. అభ్యర్థి ఇంటిపేరు రాసినా లేక వ్యక్తి పేరు రాసినా.. మొదట అక్షరం ఏది ఉంటే దాన్ని బట్టి మెరిట్ ప్రకారం గుర్తు కేటాయిస్తారు. ఒకే అక్షరం ఇద్దరికి ఉంటే తర్వాతి అక్షరాన్ని పరిగణిస్తారు.

పంచాయతీ ఎన్నికల్లో విద్యావంతులు

పోటీలో చార్టెడ్ అకౌంటెంట్లు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, హోంగార్డులు

యాచారం/కేశంపేట,డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): సర్పంచ్ పదవిపై మోజు పెరిగింది. చార్టెడ్ అకౌంటెంట్లు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, హోంగార్డులు, తాజా మాజీల భార్యలు బరిలో నిలిచారు. నందివనపర్తిలో ఎల్బీనగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న రవీందర్ తన ఉద్యోగానికి రాజీనామా చేసి బరిలో నిలిచారు. అలాగే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి వెంకటేశ్వర్లు పోటీలో నిలిచారు. మాల్‌లో చార్టెడ్ అకౌంటెంట్ బి.అశోక్‌యాదవ్ బరిలో నిలిచారు. గడ్డమల్లాయగూడలో మాజీ సర్పంచ్



నాగిళ్ల వెంకటేష్



మంజుల

అచ్చన జంగయ్య భార్య మంగమ్మ పోటీలో నిలిచారు. ఇదే గ్రామంలో రెండోసారి సర్పంచ్‌గా పోటీ చేసిన సురేందర్‌రెడ్డి, నర్రె మల్లేశ్ ఓడిపోయారు. మల్లేశ్ గతంలో ఉత్తమ పంచాయతీ అవార్డును ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు చేతుల మీదుగా అందుకున్నా ఆయన రెండోసారి సర్పంచ్‌గా గెలవలేదు. కేశంపేట మండలంలోని లింగంధన, పోమాల్‌పల్లిలో సర్పంచ్ పదవికి విద్యావంతులు పోటీలో నిలిచారు. లింగంధన పంచాయతీ ఎస్సీకి రిజర్వైంది. షాద్‌నగర్‌లో ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్న నాగిళ్ల వెంకటేష్ పోటీ చేస్తున్నాడు. నామినేషన్ వేసి గ్రామస్తుల మద్దతు కూడగట్టుకునే పనిలో ఉన్నాడు. పోమాల్‌పల్లి సర్పంచ్ జనరల్ మహిళకు కేటాయించారు. సర్పంచ్ పదవికి ఎమ్మెస్సీ కంప్యూటర్స్ చేసిన మంజుల నామినేషన్ వేశారు. తన భర్త అనుమగళ్ల రమేష్ ప్రోత్సాహంతో పోటీ చేస్తున్నట్లు ఆమె చెప్పారు.



గుర్తులు రాలేదు...
గుర్తుపట్టేలా ఊరేగింపులు

కేశంపేట, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల ప్రక్రియ వేగం పుంజుకుంది. అభ్యర్థులకు ఇంకా గుర్తులు కేటాయించకున్నా తాము ప్రజల్లో ఉండాలన్న లక్ష్యంతో గ్రామాల్లో ఊరేగింపులు నిర్వహిస్తున్నారు. ఎప్పుడూ బయటకు వెళ్లని మహిళా అభ్యర్థినులు ప్రజల్లో గుర్తింపు కోసం ఊరేగింపులు నిర్వహిస్తున్నారు. నామినేషన్ల ఉపసంహరణ తరవాతే గుర్తుల కేటాయింపు ఉండనుంది. ఆ లోగా ఎలాగూ పోటీల్లో ఉంటామనుకుంటున్న అభ్యర్థులు ఇప్పటి నుంచే ప్రచారం సాగిస్తున్నారు. డోర్ టు డోర్ వెళ్లి సర్పంచ్‌గా, వార్డు సభ్యుడిగా పోటీ చేస్తున్నట్లు వివరిస్తూ తనకు గుర్తు వచ్చిన తరువాత మరోసారి కలుస్తామని చెప్పి ఓటు అభ్యర్థిస్తున్నారు. తన పేరు పక్కన ఉండే గుర్తుకు ఓటేయాలని ఓటర్లను వేడుకుంటున్నారు. కాగా త్వరలోనే అభ్యర్థులకు ఎన్నికల అధికారులు గుర్తులు కేటాయించనున్నారు.

సీఎం ఇలాఖాలో...
ఏకగ్రీవాల పర్వం

- కొడంగల్ నియోజకవర్గంలో ఇప్పటికే పలు పంచాయతీలు ఏకగ్రీవం
- కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులకు నాయకుల వెన్నుదన్ను
- నేడు ముగియనున్న ఉపసంహరణల గడువు
- మరిన్ని పంచాయతీలు యునానిమస్ అయ్యే అవకాశం



కాంగ్రెస్ నాయకులతో నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి(ఫైల్)

కొడంగల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలో సర్పంచ్ పదవుల ఏకగ్రీవానికి నాయకులు అన్ని ప్రయత్నాలూ చేస్తున్నారు. మొదటి విడత నామినేషన్లు గత శనివారమే ముగిశాయి. ఒకే నామినేషన్ దాఖలైన కొన్నిచోట్ల సర్పంచ్ పదవులు ఏకగ్రీవమయ్యాయి. వార్డు సభ్యులు సైతం యునానిమస్ అయ్యారు. నామినేషన్ల ఉపసంహరణకు ఈ నెల మూడో తేదీ(నేటి) వరకు గడువుండటంతో ఏకగ్రీవాల కోసం నాయకులు రంగంలోకి దిగారు. కొన్ని గ్రామాలు, తండాల్లో ఆలయాల నిర్మాణం, గ్రామంలో చేపట్టాల్సిన పనులకు రూ.లక్షల్లో డబ్బు విరాళంగా ఇస్తామని ఒప్పందాలు చేసుకోవడం వంటి వాటితో ఏకగ్రీవాలకు పావులు కదుపుతున్నారు. ముఖ్యంగా కాంగ్రెస్ నాయకులు తమ పరిధి పంచాయతీల ఏకగ్రీవాలకు తండ్లాతున్నారు. ఇప్పటికే నియోజకవర్గంలోని 8 మండలాల్లో 15 సర్పంచ్‌లను అధికార పార్టీ మద్దతుదారులతో ఏకగ్రీవం చేసినట్లు తెలుస్తోంది. కొడంగల్ ఎమ్మెల్యే అయిన రేవంత్‌రెడ్డే సీఎంగా ఉండటంతో గ్రామాల అభివృద్ధికి భారీగా నిధులు వస్తాయని అంతా నమ్ముతున్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు ఒకే ఊరిలో ఎక్కువ మంది నామినేషన్లు వేస్తే బరిలో ఒక్కరే ఉండేలా విత్‌డ్రాలకు నాయకులు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు.

నియోజకవర్గంలో
15 సర్పంచ్ పదవులు ఏకగ్రీవం

కొడంగల్ నియోజకవర్గంలో 15 మంది సర్పంచ్‌లు, ఆయా పంచాయతీల వార్డు సభ్యులు ఏకగ్రీవమయ్యారు. దౌల్తాబాద్ మండలంలో తిమ్మాయిపల్లి, బొంరాస్‌పేట్ మండలం సాలిండపూర్, మదన్‌పల్లి తండా, జానకంపల్లి, నాగిరెడ్డిపల్లి, కట్టుకాల్వ తండా, టేకులగడ్డ తండా పంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి. అలాగే దుద్యాల్ మండలం సంగాయిపల్లి, నారాయణపేట్ జిల్లా మద్దూర్ మండలం పెదిరిపాడు తండా, అప్పిరెడ్డిపల్లి, దామ్లతండా, కొత్తపల్లి మండలం నందిగామ, గుండుమాల్ మండలం అప్పాయిపల్లితండా, పెద్ద తండా పంచాయతీలు సైతం ఇప్పటికే ఏకగ్రీవయ్యాయి. అంటే వీటిల్లో అన్ని పదవులకు ఒక్కో నామినేషన్ మాత్రమే దాఖలైంది. మొదటి విడత ఎన్నికల ప్రక్రియ ముగిసిన తరువాత సర్పంచ్, వార్డు సభ్యులు ఎన్నికైనట్టు అధికారులు సర్టిఫికెట్ అందజేస్తారు.

ఉప సంహరణరణలతో
పెరగనున్న యునానిమస్ పంచాయతీలు

మొదటి విడత ఎన్నికల నామినేషన్ల విత్‌డ్రాకు డిసెంబరు మూడో తేదీ మధ్యాహ్నం వరకు గడువుండడంతో బుజ్జగింపులు, ప్రలోభాలు, మరే ఇతర కారణాలతో అభ్యర్థిత్వాల ఉప సంహరణకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. సర్పంచ్ పార్టీ వారు ఎక్కువ మంది నామినేషన్‌లు వేయడంతో అందరితో మాట్లాడి ప్రజాభిమానం ఉన్న ఒకరికి ఎన్నికల్లో నిలపేలా ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ప్రతిపక్ష పార్టీ అభ్యర్థులు లేని చోట్ల సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి కొడంగల్‌లోనే మకాం వేసి పార్టీ తనపున సర్పంచ్ పదవికి ఒక్కరే ఉండేలా ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో నామినేషన్ల ఉపసంహరణ ముగింపు వరకు మరికొందరు విత్‌డ్రా చేసుకొంటే ఏకగ్రీవ పంచాయతీల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

పంచాయతీ పదవులకు వందల్లో నామినేషన్లు...

దౌల్తాబాద్ మండలంలో 33 పంచాయతీలు ఉండగా 173 మంది సర్పంచ్, 290 వార్డులకు 593 మంది నామినేషన్‌న్లు వేశారని ఆర్వోలు తెలిపారు. బొంరాస్‌పేట్ మండలంలో 35 పంచాయతీలు ఉన్నాయి. 152 మంది సర్పంచ్ పదవులకు, 292 వార్డులకు 526 మంది నామాంకణ పత్రాలు దాఖలు చేశారని రిటర్నింగ్ అధికారులు తెలిపారు. కాగా లోతుకుంట తండాలో సర్పంచ్ పదవికి ముగ్గురు నామినేషన్ వేయగా వార్డు సభ్యులంతా ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు తెలుస్తోంది.

మొండి బకాయిలకు మోక్షం

ఎన్నికల్లో పోటీకి పన్నులన్నీ చెల్లించాల్సిందే..
పంచాయతీల ఖజానాకు కొంత మేర డబ్బు జమ



కులకచర్ల, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఎన్నికల పుణ్యమా అని పంచాయతీలకు ఆదాయం సమకూరుతోంది. పోటీ చేసే అభ్యర్థులు ఇంటి పన్ను చెల్లించాలనే నిబంధన ఉండటంతో పోటీ చేసే వారు తప్పక పన్ను బకాయిలు చెల్లింపు చేయాల్సిందే. లేదంటే వారి నామినేషన్‌ను సైతం తిరస్కరిస్తారు. పంచాయతీ కార్యదర్శి నుంచి నో డ్యూ సర్టిఫికెట్ సమర్పించాల్సి ఉంటుంది. దీంతో సర్పంచ్, వార్డు పదవులకు పోటీ పడుతున్న వారు పన్ను బకాయిలు చెల్లిస్తున్నారు. పంచాయతీలకు ప్రభుత్వ నిధులు రాక ప్రజా పనులకు నిధుల్లేవు. కొందరు రెగ్యులర్‌గా పన్ను చెల్లిస్తుంటే మరి కొందరు ఇలాంటి సందర్భాల్లో మాత్రమే పన్ను చెల్లిస్తుంటారు. దీంతో పంచాయతీలకు మొండి బకాయిల సమస్య ఏర్పడింది. ఎన్నికల నేపథ్యంలో కార్యదర్శులు పన్నువసూళ్లు చేసి నో డ్యూ సర్టిఫికెట్లు ఇస్తున్నారు. మొత్తానికి పంచాయతీ ఖజానాకు ఎంతో కొంత డబ్బు సమకూరుతోంది.

ముగ్గురు సర్పంచ్ అభ్యర్థుల ఉపసంహరణ

తాండూరు రూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): తాండూరు మండలం ఆయా పంచాయతీల్లో ముగ్గురు సర్పంచ్ అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారని తాండూరు ఎంపీడీవో విశ్వప్రసాద్ మంగళవారం తెలిపారు. వీర్‌శెట్టిపల్లి కుర్వ రేణుక, చింతామణిపట్నం కుర్వ నవిత, ఐనెల్లిలో పెద్దింటి సుధీర్‌కుమార్ నామినేషన్లు ఉపసంహరించుకున్నట్లు ఆయన చెప్పారు.

రెండు గ్రామాల సర్పంచ్
పదవులు ఏకగ్రీవం



జాను



పాత్లావత్ లక్ష్మి

కడ్తాల, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని రేఖ్యాతండా, గోవిందాయపల్లి తండా పంచాయతీ సర్పంచ్ పదవులు ఏకగ్రీమం అయ్యాయి. రెండు సర్పంచ్ పదవులకు ఒక్కో నామినేషనే దాఖలయ్యాయి. రెండు సర్పంచ్ పదవులు ఎస్టీ మహిళకు కేటాయించారు. రేఖ్యాతండా సర్పంచ్ అభ్యర్థిగా పాత్లావత్ లక్ష్మి, గోవిందాయపల్లి సర్పంచ్‌గా సబావట్ జాను నామినేషన్ వేశారు. మంగళవారం నామినేషన్ల దాఖలు గడువు ముగియడంతో రెండు పదవులు ఏకగ్రీవం అయ్యాయి. అలాగే రేఖ్యా తండా పంచాయతీలో 8వార్డులు ఏకగ్రీవం అయ్యాయి. ఎన్నికల ప్రక్రియ ముగిసిన తరువాత అధికారులు ప్రకటించాల్సి ఉంది.



బ్యాలెట్ బాక్సులు వచ్చేశాయ్

తొలి విడత 11వ తేదీన జరిగే సర్పంచ్ ఎన్నికల నిర్వహణకు అవసరమైన బ్యాలెట్ బాక్సులు కొడంగల్ మండలానికి వచ్చేశాయి. మండల పరిధిలోని 25 గ్రామ పంచాయతీలలో మొత్తం 222 వార్డులు ఉండగా.. అవసరమయ్యే బ్యాలెట్ బాక్సులు 249 మండలానికి రాగా వాటిని స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో భద్రపరిచారు.

- కొడంగల్ రూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి)

ఉప సర్పంచ్ స్థాయి నుంచి
ఉప సభాపతి వరకు...

సర్పంచ్‌గా గెలిచి పరిగి పంచాయతీకి సేవలందించిన హరీశ్వర్‌రెడ్డి

ఐదు సార్లు ఎమ్మెల్యేగా రికార్డు విజయాలు



పరిగి,నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పరిగి పంచాయతీ నుంచి రాజకీయ అరంగేట్రం చేసిన దివంగత కొప్పుల హరీశ్వర్‌రెడ్డి ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. 45ఏళ్ల ఆయన రాజకీయ జీవితం పంచాయతీ నుంచే ఎదిగింది. పరిగి పంచాయతీ వార్డు సభ్యుడిగా ఎన్నికైన ఆయన అంచలంచెలుగా ఎదిగి పరిగి నుంచి అసెంబ్లీకి ఐదు సార్లు ఎన్నికై ఉమ్మడి రాష్ట్రంలో డిప్యూటీ స్పీకర్‌గానూ సేవలందించారు. 1947లో జన్మించిన హరీశ్వర్‌రెడ్డి 23ఏళ్లకే రాజకీయాల్లో కొచ్చారు. 1970లో పరిగి పంచాయతీ వార్డు సభ్యుడిగా గెల్చి ఉప సర్పంచ్ అయ్యారు. అప్పట్లో సిట్టింగ్ సర్పంచ్ సిద్ధాంతి పెద్దవెంకటాచారి మృతితో హరీశ్వర్‌రెడ్డి 1978లో ఇన్‌చార్జి సర్పంచ్‌గా బాధ్యతలు తీసుకున్నారు. 1981లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్‌గా గెలిచి సమితి ఉపాధ్యక్షుడయ్యారు. 1983లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి 56ఓట్ల స్వల్ప తేడాతో ఓడిపోయారు. అంతలోనే టీడీపీలో చేరి 1985లో జరిగిన మధ్యంతర ఎన్నికల్లో టీడీపీ నుంచి ఎమ్మెల్యే పదవికి పోటీ చేసి గెలిచారు. అదే సమయంలో టీటీడీ బోర్డు డైరెక్టర్‌గా సేవలందించారు. 1989లో జరిగిన ఎన్నికల్లో ఓడిపోయారు. అనంతరం 1994, 1999, 2004, 2009 జరిగిన శాసనసభ ఎన్నికల్లో వరుసగా నాలుగుసార్లు పరిగి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 1999 నుంచి 2004 వరకు రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్‌గా, అప్పటి ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్‌గా పని చేశారు. ఇన్ని పదవులు అధిష్ఠించిన హరీశ్వర్‌రెడ్డి రాజకీయ ప్రస్థానం పంచాయతీ వార్డు సభ్యుడి నుంచి మొదలవడం గమనార్హం.

వలస ఓట్ల వేట

- వలసపోయిన గ్రామస్తులను కలుస్తున్న అభ్యర్థులు
- ఒక్కో ఓటు ఏకం చేస్తూ గెలుపునకు బాటలు
- ఊరొచ్చి ఓటేయాలని వేడుకోళ్లు..

కొత్తూర్, డిసంబరు 2(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలు దగ్గర పడుతుండడంతో సర్పంచ్, వార్డు పదవులకు పోటీపడుతున్న అభ్యర్థులు ఓట్ల వేటలో పడ్డారు. బతుకుదెరువు కోసం కుటుంబాలతో సహా హైదరాబాద్, సమీప పట్టణాలకు వలపోయిన ఓటర్ల వివరాలు కనుక్కొని ఎన్నికల నాటికి వారిని గ్రామానికి రప్పించే ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు. షాద్‌నగర్ నియోజకవర్గంలోని కొత్తూర్, ఫరూఖ్‌నగర్, నందిగామ మండలాలు హైదరాబాద్‌కు చేరువలో ఉండడంతో ఆయా గ్రామాల్లోని వారు హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డారు. ఓట్లు మాత్రం ఇంకా గ్రామల్లోనే ఉన్నాయి. ఇలా వేలాది మంది తమ పిల్లల చదువులు, ఉద్యోగరీత్యా, రియల్ ఎస్టేట్, ఇతర వ్యాపారాలు నిర్వహించుకుంటూ రాజధానిలో స్థిరపడ్డారు. అక్కడ ఉంటున్న వారు ప్రతీ ఎన్నికల్లో సొంతూళ్లకొచ్చి ఓటు వేసి వెళ్తుంటారు. అలాగే కొత్తూర్ పారిశ్రామికవాడలోని పరిశ్రమల్లో గ్రామీణులు వేలల్లో పనిచేస్తున్నారు. వారంతా పంచాయతీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఆసక్తి చూపుతారు. పోటీ చేస్తున్న అభ్యర్థులు సైతం వారి గ్రామాల ఓటర్లు ఎక్కడెక్కడ ఉన్నారో లిస్టు తీసుకుంటూ ఫోన్లు చేస్తున్నారు. ఇలా వారి అడ్రెస్ తెలుసుకొని తెల్లవారుజామునే నగరానికి వెళ్లి వారిని కలిసి తమకే ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. రానుపోనూ అయ్యే రవాణా ఖర్చులన్నీ తామే భర్తిస్తామని డబ్బు అందజేసి వస్తున్నారు. పంచాయతీ ఎన్నికల్లో ఒక్కోఓటు ఎంతో అమూల్యమైంది. కాబట్టి పోటీచేస్తున్న వారు గ్రామంలోని ఓటర్లను ఓట్లు ఎలా అడుగుతున్నారో.. వలసపోయిన వారికి సైతం నిత్యం ఫోన్లు చేస్తూ.. వీలున్న సమయాల్లో నేరుగా కలుస్తూ ఓటు అభ్యర్థిస్తుండడం ఆసక్తిగా మారింది.

వైభవంగా కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



పల్లకీ సేవలో భక్తులు


తలకొండపల్లి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రాంపూర్ శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో దేవాలయాన్ని పచ్చటి తోరణాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. ఆలయ కమిటీ చైర్మన్ జిల్లెల్ల పవన్‌కుమార్ రెడ్డి, ఈవో స్నేహలతల ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఏర్పాట్లు చేశారు. ఈనెల 6 వరకు కొనసాగే ఉత్సవాల్లో భాగంగా రెండోరోజు మంగళవారం ధ్వజారోహణం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కాగా, నేడు(బుధవారం) నిర్వహించే స్వామి వారి కల్యాణానికి పెద్దఎత్తున ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కాకి లక్ష్మయ్య, స్వామి గౌడ్, వెంకటయ్య, యాదయ్య, జంగయ్య, మాజీ సర్పంచ్ శ్యామ్‌సుందర్‌రెడ్డి, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శామీర్‌పేట పోలీస్ స్టేషన్
ఉత్తమ పీఎస్‌గా ఎంపికవడం గర్వకారణం



ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్, ఎస్సైలు, ఏఎస్సైలు, కానిస్టేబుళ్లు

శామీర్‌పేట, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ సేవల్లో రాష్ట్రంలో నంబర్ వన్‌గా, దేశంలో ఏడో ర్యాంక్ సాధించింది. దీంతో సంబంధిత కమిషనర్‌ను, స్టేషన్ సిబ్బందిని మంగళవారం రాష్ట్ర డీజీపీ శివధర్‌రెడ్డి అభినందించారు. సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి, ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్, ఎస్సైలను, సిబ్బందిని డీజీపీ ప్రశంసించారు. ఇది గర్వకారణమైన విషయం అన్నారు. అలాగే మేడ్చల్ జోన్ సైబరాబాద్ డీసీపీ కోటిరెడ్డి, మేడ్చల్ ఏడీసీపీ పురుషోత్తం, ఏసీపీ బాలగంగిరెడ్డి సైతం అభినందించారు. ఈ విషయాన్ని ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ వెల్లడించారు. పోలీసుల సేవలు, రికార్డుల నిర్వహణ, ఫిర్యాదుల పరిష్కారం వంటి అంశాలను కేంద్ర హోం శాఖ పరిగణలోకి తీసుకుని శామీర్‌పేట స్టేషన్‌కు దేశంలో ఏడో ర్యాంక్, రాష్ట్రంలో ఒకటో ర్యాంక్ ఇచ్చిందన్నారు. పోలీస్‌స్టేషన్ అధికారులు, సిబ్బందిని వివిధ పార్టీల నాయకులు సన్మానించారు. ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్, ఎస్సైలు, ఏఎస్సైలు, కానిస్టేబుళ్లను జిల్లా ఆర్టీఏ సభ్యుడు జైపాల్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ మధుసూదన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు రమేశ్, మన్నె భిక్షపతి, నోముల మధుసూదన్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, హైమారెడ్డి, మహేందర్‌రెడ్డి, వైఎస్‌గౌడ్, ప్రవీణ్, రాకేష్, నరేష్, మధు, దర్శన్, కిశోర్‌యాదవ్, కృష్ణారెడ్డి, క్యాతం మధుకృష్ణలు సన్మానించారు. శామీర్‌పేట పోలీసులు ఉత్తమ సేవలను అలాగే కొనసాగించాలని జైపాల్‌రెడ్డి ఆకాంక్షించారు.



సన్మానిస్తున్న బీజేపీ నాయకురాలు హైమారెడ్డి

అంతర్జాతీయ సైన్స్ సదస్సుకు
దాదాపూర్ ఉపాధ్యాయుడు



శాంతకుమార్

దోమ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ సైన్స్ సదస్సుకు దోమ మండలం దాదాపూర్ ఉన్నత పాఠశాలకు చెందిన సైన్స్ ఉపాధ్యాయుడు శాంతకుమార్ ఎంపికయ్యారు. ఈ నెల 6 నుంచి 9 వరకు ఛండీగఢ్‌లో జరిగే ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌లో పాల్గొననున్నట్లు తెలిపారు. బోధన అనుభవం, వినూత్న బోధనా పద్ధతుల ఉపయోగించడం, ప్రయోగాల నిర్వహణ, పాఠశాలలో జరిగే వివిధ కార్యక్రమాలు, విద్యార్థులు విజ్ఞాన ప్రదర్శనల్లో పాల్గొనడం లాంటి అంశాలను పరిగణనలోకి తీసుకొని ఎంపిక చేసినట్లు సమాచారం. అంతర్జాతీయ సైన్స్ సదస్సుకు రెండోసారి ఎంపికకావడంతో ఉపాధ్యాయుడు శాంతకుమార్ సంతోషం వ్యక్తం చేశారు.

అద్దె వాహనానికి కొటేషన్ల ఆహ్వానం

మేడ్చల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రభుత్వ సేవల నిర్వహణలో భాగంగా మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖకు అద్దె వాహనం కోసం అర్హత కలిగిన ట్రావెల్ ఏజెన్సీలు, వాహన యజమానుల నుంచి కొటేషన్లు ఆహ్వానిస్తున్నట్లు ఆ శాఖ జిల్లా అధికారి ఝాన్సీరాణి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వాహనానికి నెలకు రూ.33 వేల అద్దె ఉంటుందని, నెలకు 2,500 కిలోమీటర్ల చొప్పున ఏడాది పాటు ఉంటుందన్నారు. అర్హతతో పాటు వాహనం కండిషన్, డ్రైవర్‌కు టాక్సీ ప్లేట్ రిజిస్ట్రేషన్, ఫిట్నెస్, ఇన్సూరెన్స్, కాలుష్యం యంత్రణ, ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలు, షరతులు పాటించాల్సి ఉంటుందన్నారు. వాహన యజమానులు తమ కొటేషన్లను మేడ్చల్ కలెక్టరేట్‌లోని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ కార్యాలయంలో ఈ నెల 5వ తేదీ వరకు అందజేయాలన్నారు.



ఆమనగల్లు : శెట్టిపల్లిలో అర్జున్‌రావు, లక్ష్మణ్‌రావులతో కలిసి నామినేషన్ వేస్తున్న జంగమ్మ వెంకటయ్య



కడ్తాల : బీఆర్ఎస్ మద్దతు అభ్యర్థి ఆనంద్‌ను సన్మానిస్తున్న జీఎల్ఎన్‌రెడ్డి, దశరథ్ నాయక్

భారీగా నామినేషన్లు

● రెండో దఫా ముగిసిన నామినేషన్ల పర్వం

ఆమనగల్లు/కేశంపేట/యాచారం/చేవెళ్ల/మొయినాబాద్‌రూరల్/ఆదిభట్ల/మహేశ్వరం/కందుకూరు/శంషాబాద్ రూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో కీలక నామినేషన్ల ఘట్టం ప్రశాంతంగా ముగిసింది. రెండో దఫా చివరిరోజు మంగళవారం నామినేషన్లు ఊపందుకున్నాయి. భారీ జనసమీకరణ, తమ పార్టీ నేతలతో కలిసి ర్యాలీగా వచ్చి సర్పంచ్, వార్డు సభ్యుల పదవులకు అభ్యర్థులు అట్టహాసంగా నామినేషన్లు వేశారు. పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ఆనామినేషన్ కేంద్రాలను ఎన్నికల జిల్లా సహాయ అధికారులు సందర్శించి ఆర్వోలకు పలు సూచనలు చేశారు. కొన్నిచోట్ల అభ్యర్థులు పెద్దఎత్తున రావడంతో రాత్రి వరకు కూడా నామినేషన్లు స్వీకరించారు. మరికొన్ని కేంద్రాల వద్ద సర్పంచ్, వార్డు సభ్యులకు నామినేషన్ వేయడానికి ఒకేసారి ఎక్కువ సంఖ్యలో అభ్యర్థులు రావడంతో టోకెన్లు ఇచ్చారు. కాగా, నామినేషన్ ప్రక్రియ పూర్తి కావడంతో అధికారులు సామగ్రి విభజన పూర్తి చేశారు. సర్పంచ్ పదవికి పోటీచేసే అభ్యర్థులకు నామినేషన్ పత్రాలను క్లస్టర్‌లలో అందుబాటులో పెట్టామని, ప్రతి క్లస్టర్‌లో



ఆదిభట్ల : నామినేషన్ కేంద్రాలకు సామగ్రిని తీసుకెళ్తున్న సిబ్బంది

ఐదారు మంది పంచాయతీ సిబ్బందిని అందుబాటులో ఉంటారని యాచారం మండల ప్రత్యేకాధికారి మాధవ రావు, ఎంపీడీవో రాధారాణిలు వెల్లడించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ ఎన్నికల ఆర్వో, ఏఆర్వోలకు శిక్షణ ఇచ్చారు. చేవెళ్ల, షాబాద్, శంకర్‌పల్లి, మొయినాబాద్ తదితర మండలాల్లోని గ్రామాల్లో చివరిరోజు సర్పంచ్, వార్డు స్థానాలకు నామినేషన్ వేసేందుకు అభ్యర్థులు పోటీపడ్డారు. ఇబ్రహీంపట్నంలో నేటి నుంచి మూడోదశ నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం కానుంది. అలాగే మహేశ్వరంలో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.



అమనగల్లు : ఆకుతోటపల్లిలో డప్పు కొడుతూ నామినేషన్ సెంటర్‌కు వెళ్తున్న నిట్ట నారాయణ



కడ్తాల : ఎమ్మెల్యే కసిరెడ్డితో కలిసి నామినేషన్ వేస్తున్న రాయికంటి భిక్షపతి

శంషాబాద్ పరిధిలో 12 సర్పంచ్ స్థానాలకు, 31 వార్డు సభ్యులకు సంబంధించి అభ్యర్థులు నామినేషన్లను ఉపసంహరించుకున్నారని ఎంపీడీవో మున్ని చెప్పారు.

క్రైం కార్నర్

14 లీటర్ల మద్యం సీజ్

యాచారం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి) మండల కేంద్రంలో మద్యం దుకాణం నుంచి కుర్మిద్ద గ్రామానికి అక్రమంగా మద్యం తరలిస్తున్న ఓ వ్యక్తిని రాచకొండ ఎస్‌వోటీ పోలీసులు మంగళవారం సాయంత్రం పట్టుకొని 14 లీటర్ల చీప్‌లిక్కర్ సీజ్ చేశారు. మండల పరిధిలోని కుర్మిద్దకు చెందిన ప్రణయ్ తన బ్యాగ్‌లో 14 లీటర్ల చీప్‌లిక్కర్ తరలిస్తుండగా రాచకొండ ఎస్‌వోటీ పోలీసులు పట్టుకొని యాచారం పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మధు తెలిపారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

మొయినాబాద్ రూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): హత్య కేసులో ఎల్‌బీ నగర్ న్యాయస్థానం నిందితుడికి జీవిత ఖైదు విధించింది. సైబరాబాద్ క్రైమ్ డీసీపీ ముత్యంరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మొయినాబాద్ మండల కేంద్రంలో హుస్సేన్ భార్య హుస్సైన్‌బీతో కలిసి నివాసముంటున్నాడు. కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు. ఈక్రమంలో మద్యానికి బానిసైన హుస్సేన్(60) తన భార్యను నిత్యం డబ్బులు అడిగేవాడు. 2023 ఫిబ్రవరి 2న మద్యం తాగి వచ్చిన అతడు భార్యను డబ్బులు అడగగా నిరాకరించడంతో కోపోద్రిక్తుడైన హుస్సేన్ కర్ర, బండరాయితో ఆమెపై దాడి చేయడంతో మృతి చెందింది. ఆమె బంధువు సఫియా బేగం అప్పటి మొయినాబాద్ సీఐ లక్ష్మీరెడ్డికి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నేరం రుజువు కావడంతో రిమాండ్‌కు తరలించారు. అనంతరం చార్జ్‌షీట్ దాఖలు చేశారు. వాదనలు, సాక్ష్యాధారాల పరిశీలన పూర్తయ్యాక ఎల్‌బీ నగర్‌లోని 8వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి హుస్సేన్‌కు జీవిత ఖైదు విధించారు. రూ.500 జరిమానా కూడా విధించారు.

ఎయిర్‌పోర్టులో ప్రయాణికుడి బ్యాగు మాయం

● గంటలోనే పట్టుకున్న పోలీసులు.. బాధితుడికి అప్పగింత

శంషాబాద్ రూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఓ ప్రయాణికుడు బ్యాగు మాయమైన ఘటన ఆర్జీఐఏ ఔట్ పోస్ట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ సంపతి కనకయ్య కథనం ప్రకారం.. నగరానికి చెందిన సయ్యద్ సర్దార్ హుస్సేన్ మంగళవారం ఎయిర్ పోర్టుకు వచ్చారు. ఈక్రమంలో ఆయన బ్యాగు కనిపించడం లేదని, అందులో రూ.60 వేల విలువైన ఆభరణాలు ఉన్నట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీసీటీవీ ఫుటేజీని పరిశీలించి బ్యాగు ఆచూకీ కనుగొని బాధితుడికి అందజేశారు. గంట వ్యవధిలోనే బ్యాగును స్వాధీనం చేసుకోవడంతో హుస్సేన్ వారిని అభినందించారు.



బాధితుడికి బ్యాగు అందజేస్తున్న సీఐ సంపతి కనకయ్య

ధాన్యం.. దైన్యం

(ఏడో పేజీ తరువాయి)

గన్నీ బ్యాగ్‌లు లేక తూకాలు నిలిచిపోయాయి. ఇక్కడ నవంబర్ 13న పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి కొనుగోలు కేంద్రాన్ని స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రారంభించారు. ఇప్పటివరకు 17,050 బ్యాగుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాల పరిధిలోని పలు గ్రామాల నుంచి రైతులు కొనుగోలు కేంద్రానికి ధాన్యాన్ని తరలిస్తున్నారు. చలికాలం నేపథ్యంలో మంచు ప్రభావంతో ధాన్యంలో తేమ శాతం ఎక్కువగా ఉంటోంది. ఫలితంగా మార్కెట్ యార్డ్ ఆవరణలో ధాన్యాన్ని నిత్యం ఆరబెట్టడానికి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కొందరు వారం పదిరోజులుగా మార్కెట్ యార్డ్‌లోనే ధాన్యం విక్రయానికి నిరీక్షిస్తున్నారు. దీనికితోడు మూడు రోజులుగా గన్నీ బ్యాగులు లేక కేంద్రం నిర్వాహకులు ధాన్యం కొనుగోళ్లను నిలిపివేశారు. ఫలితంగా మార్కెట్ యార్డ్ ధాన్యం కుప్పలతో నిండిపోయింది. గన్నీ బ్యాగుల కోసం పౌర సరఫరాల శాఖకు ఇండెంట్ పెట్టామని, వచ్చిన వెంటనే కొనుగోళ్లు చేపడుతామని కేంద్రం నిర్వాహకులు చెబుతున్నారు.

తేమ శాతాన్ని పెంచాలి



ఈ ఏడాది సరిగా పంట దిగుబడి లేక పెట్టుబడులు కూడా చేతికందేలా లేదు. పది రోజుల క్రితం 120 క్వింటాళ్ల వరి ధాన్యాన్ని విక్రయానికి ఆమనగల్లు కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చాను. చలి మంచు ఉండడంతో రోజూ ఆరబెట్టాల్సిన పరిస్థితి వచ్చింది. అధికారులు సమస్యను గుర్తించి తేమ శాతాన్ని పెంచి ధాన్యం తూకాలు త్వరగా చేపట్టాలి.

- కసిరెడ్డి కొండల్‌రెడ్డి, రైతు, చంద్రాయన్‌పల్లి

గన్నీ బ్యాగులకు ఇండెంట్ పెట్టాం



ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. తూకాలు వేగవంతంగా చేపడుతున్నాం. ప్రభుత్వం నిర్ణయించిన తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని వెంటనే తూకాలు వేస్తున్నాం. చాలా మంది రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకొని తేకపోవడం వల్ల కొనుగోలుకు ఇబ్బంది కలుగుతుంది. గన్ని బ్యాగుల కోసం ఇండెంట్ పెట్టాం. బ్యాగులు రాగానే కొనుగోళ్లు ప్రారంభిస్తాం.

- గంప వెంకటేశ్, పీఏసీఎస్ చైర్మన్, ఆమనగల్లు

కాంగ్రెస్ నేతలను హామీల అమలుపై నిలదీయాలి

తలకొండపల్లి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): హామీలను విస్మరించి ప్రజలను వంచించిన కాంగ్రెస్ పార్టీకి స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని, హామీల అమలుపై నేతలను నిలదీయాలని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్ అన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో గ్రామాలు ఎంతగానో ప్రగతి సాధించాయన్నారు. తలకొండపల్లి మండలం చీపునుంతలలో మంగళవారం బీఆర్ఎస్ మద్దతు తెలిపిన సర్పంచ్ అభ్యర్థి బత్తుల కృష్ణవేణి బాలకుమార్ గౌడ్‌తో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. జైపాల్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్, మాజీ ఎంపీపీ నిర్మలశ్రీశైలం గౌడ్, బీఆర్ఎస్ నాయకులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. జైపాల్ యాదవ్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రచారానికి వచ్చే కాంగ్రెస్ నాయకులను 420 హామీలు, ఆరు గ్యారంటీల అమలు, బాకీపడ్డ డబ్బుల గురించి ప్రజలు నిలదీయాలని పిలుపునిచ్చారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో ప్రచార ఆర్భాటమే తప్ప ప్రగతి ఏమీ లేదన్నారు. కాంగ్రెస్, బీజేపీల పరిస్థితి గల్లీలో కుస్తీ, ఢిల్లీలో దోస్తీ అన్నట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. కేసీఆర్ పాలనలో రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. రేవంత్ పాలన, అనాలోచిత నిర్ణయాలతో రాష్ట్రం వెనుకబాటుకు గురవుతుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌ను క్లీన్‌స్వీప్ చేయడం ఖాయమని జైపాల్‌యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరోత్తమ్‌రెడ్డి, జనార్దన్ రెడ్డి, శేఖర్, శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్లు ప్రారంభం

ఆమనగల్లు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని విఠాయిపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను మంగళవారం మాజీ సర్పంచ్ పర్వతాలు ప్రారంభించారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మంజూరు చేసిన నిధులతో లైట్లను ఏర్పాటు చేశారు. కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని ఆయన అన్నారు. వెంకట్ రెడ్డి, శ్రీధర్‌నాయక్, రాగ్యనాయక్, వెంకట్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'వర్ధమాన్' వేదికగా స్మార్ట్ ఇండియా హ్యాకథాన్-2025 గ్రాండ్ ఫినాలే

● ఈనెల 8, 9న నిర్వహణ

శంషాబాద్ రూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ ఇండియా హ్యాకథాన్-2025 సాఫ్ట్‌వేర్ ఎడిషన్ గ్రాండ్ ఫినాలేకు శంషాబాద్‌లో గల వర్ధమాన్ ఇంజినీరింగ్ కళాశాల వేదిక కానుంది. దేశ వ్యాప్తంగా ఎంపికైన 60 నోడల్ సెంటరకు గాను తెలంగాణ నుంచి ఎంపికైన ఐదు కేంద్రాల్లో వర్ధమాన్ కళాశాల ఒకటి. గ్రాండ్ ఫినాలేను ఈ నెల 8, 9న నిర్వహించనున్నారు. అయితే, ఈ ఏడాది వర్ధమాన్ నోడల్ సెంటర్‌లో 11 రాష్ట్రాల నుంచి 151 మంది స్టూడెంట్ ఇన్నోవేటర్లు గ్రాండ్ ఫినాలేలో పోటీ పడనున్నట్లు ప్రొఫెసర్, నోడల్ సెంటర్ హెడ్, ప్రిన్సిపాల్ జేవీఆర్ రవీంద్ర తెలిపారు.

కడ్తాల అభివృద్ధికి బాటలు వేస్తా : ఆనంద్



ర్యాలీలో సర్పంచ్ అభ్యర్థి బావండ్లపల్లి ఆనంద్ తదితరులు

కడ్తాల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ మద్దతుతో సర్పంచ్‌గా పోటీ చేస్తున్న తనను ఆదరించి గెలిపిస్తే నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ కడ్తాల గ్రామ పంచాయతీ అభివృద్ధికి బాటలు వేస్తానని బావండ్లపల్లి ఆనంద్ అన్నారు. అభివృద్ధిని కాంక్షించి ప్రజలంతా తనను ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. బీఆర్ఎస్ మద్దతుతో కడ్తాల సర్పంచ్ అభ్యర్థిగా మంగళవారం బావండ్లపల్లి ఆనంద్ నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీకి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పంచాయతీ ప్రజలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. దాంతో కడ్తాల గులాబీమయమైంది. ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు కడారి రామకృష్ణ, నాయకులతో కలిసి ఆనంద్ ప్రధాన వీధుల మీదుగా ర్యాలీ చేపట్టారు. అనంతరం స్థానిక ఎంబీఏ గార్డెన్‌లో నిర్వహించిన సమావేశంలో బావండ్లపల్లి ఆనంద్ మాట్లాడుతూ కడ్తాల గ్రామ పంచాయతీ సమస్యలపై తనకు పూర్తి అవగాహన ఉందన్నారు. గతంలో ఎంపీటీసీగా, వైస్ ఎంపీపీగా పనిచేసిన పాలనానుభవం తనకు ఉందని చెప్పారు. విద్యావంతుడిని, సమస్యలపై సంపూర్ణ అవగాహన కల్గిన తనకు అవకాశం కల్పిస్తే నిరంతరం ప్రజల మధ్యే ఉండి ప్రగతికి బాటలు వేస్తానన్నారు. ఏ పార్టీకి ఓటు వేస్తే మేలు జరుగుతుందో ప్రజలే ఆలోచించుకోవాలని ఆయన కోరారు. కాంగ్రెస్ మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని కోరారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ విఫలైందని, రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో కడ్తాల వెనుకబాటుకు గురైందని ఆనంద్ అన్నారు. బీఆర్ఎస్ నాయకులు మంగళపల్లి నర్సింహ, లాయక్‌అలీ, రాంచంద్రయ్య, రవి, అంజి, సంతోష్, వెంకటేశ్, సురేశ్, మహేశ్, యాదయ్య, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



నామినేషన్ సందర్భంగా సమావేశంలో సర్పంచ్ అభ్యర్థి బావండ్లపల్లి ఆనంద్

వాసవి, వనిత క్లబ్‌లకు అవార్డుల పంట

షాద్‌నగర్ అర్బన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ వాసవి, వనిత క్లబ్‌లు చేసిన సామాజిక సేవకు అవార్డుల పంట పండింది. హైదరాబాద్‌లో మంగళవారం నిర్వహించిన డిస్ట్రిక్ట్ కాన్ఫరెన్స్‌లో క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు ఇరుకుల రామకృష్ణ, మాజీ అధ్యక్షుడు గంప నాగేశ్వర్‌లు అవార్డులను అందజేసినట్లు వాసవి, వనిత క్లబ్ అధ్యక్షులు కల్వ మాణిక్యం, కల్వ మధుప్రియలు తెలిపారు. మొదటి ఉత్తమ అవార్డుతో పాటు 12 విభాగాలలో అవార్డులు వచ్చాయని, ఉత్తమ సేవకు జిల్లాస్థాయిలో అవార్డులు అందుకోవడానికి సహకారం అందించిన క్లబ్‌ల సభ్యులకు, దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

కాంక్రీట్ మిల్లర్ లేబర్ సంక్షేమానికి కృషి

చేవెళ్ల, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): కాంక్రీట్ మిల్లర్ లేబర్ సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తామని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాకిటి నాగరాజు, ప్రధాన కార్యదర్శి బి.గోపాల్ తెలిపారు. కాంక్రీట్ మిల్లర్ లేబర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం చేవెళ్ల పట్టణ కేంద్రంలో మిల్లర్ మేస్త్రీలకు చేయూత కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రమాదవశాత్తు మృతి చెందిన మిల్లర్ కార్మికులకు రూ.లక్ష ఆర్థికసాయం అందిస్తున్నట్లు చెప్పారు. అంతకుముందు చేవెళ్ల ట్రాఫిక్ సీఐ సతీష్ మాట్లాడుతూ కార్మికులు తప్పనిసరిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచించారు. శాంతమ్మ, శ్రీరాములు, పరుశురాం, రామకృష్ణ, వెంకటేశ్, శ్రీనివాస్, తిరుపతయ్య, వినోద్, శ్రీనివాస్‌లు తదితరులు ఉన్నారు.

బాల్యవివాహాలను అరికట్టాలి

మహేశ్వరం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలను అరికట్టాలని, ప్రతీఒక్కరు దీనిని ఒక సామాజిక బాధ్యతగా తీసుకొని ముందుకురావాలని తహసీల్దార్ చిన్న అప్పలనాయుడు అన్నారు. బాల్య వివాహాల నిర్మూలనపై ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం మహేశ్వరంలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ఎంపీడీవో శైలజ, సీడీపీవో శాంతి శ్రీ, ఎంఈవో కస్నానాయక్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు రూ.కోటీ 50లక్షల రుణాలు

కందుకూరు, డిసెబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నుంచి 14మంది రైతులకు రూ.కోటీ 50లక్షల దీర్ఘకాలిక రుణాలను మంజూరు చేసినట్లు చైర్మన్ డి.చంద్రశేఖర్ తెలిపారు. ఈమేరకు మంగళవారం పాలకవర్గం సభ్యులతో కలిసి రైతులకు ఆయన రుణాల చెక్కులను అందజేశారు.

కడ్తాల ప్రగతికి కృషి చేస్తాం : కసిరెడ్డి

● సర్పంచ్ అభ్యర్థిగా కాంగ్రెస్ మద్దతు దారు రాయికంటి భిక్షపతి నామినేషన్



కడ్తాలలో నిర్వహించిన ర్యాలీలో భిక్షపతితో ఎమ్మెల్యే కసిరెడ్డి

కడ్తాల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అభ్యర్థి రాయికంటి భిక్షపతి విజయం కడ్తాల గ్రామ పంచాయతీ అభివృద్ధికి మార్గమని, ఆ దిశగా కృషి చేస్తామని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. ప్రగతిని కాంక్షించి ప్రజలంతా కాంగ్రెస్‌తో కలిసి రావాలని పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో మంగళవారం కాంగ్రెస్ మద్దతుతో సర్పంచ్ అభ్యర్థిగా రాయికంటి భిక్షపతి నామినేషన్ సందర్భంగా భారీ ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. గ్రామంలోని ప్రధాన వీధుల మీదుగా కాంగ్రెస్ జెండాలు చేబూని ర్యాలీ కొనసాగింది. ఎమ్మెల్యే కసిరెడ్డి, మాజీ ఎంపీటీసీ గురిగళ్ల లక్ష్మయ్యలతో కలిసి భిక్షపతి సర్పంచ్ పదవికి నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం కేశవరెడ్డి గార్డెన్‌లో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమన్నారు. భిక్షపతిని గెలిపిస్తే కడ్తాలను అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచి ఆదర్శంగా నిలుపుతామన్నారు. ఫోర్త్‌సిటీ సమీపంలో ఉన్న కడ్తాల అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని తెలిపారు. ప్రజాభీష్టానికనుగుణంగా కాంగ్రెస్ పథకాలు రూపొందించి అమలు చేస్తుందని చెప్పారు. విపక్షాల మాటలు నమ్మి ప్రజలు మోసోవద్దని సూచించారు. కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థి భిక్షపతి మాట్లాడుతూ కడ్తాల సర్పంచ్‌గా ప్రజలు ఆదరించి గెలిపిస్తే సేవకుడిగా పనిచేస్తానన్నారు. స్థానిక సమస్యలపై తనకు పూర్తి అవగాహన ఉందని, అన్ని కాలనీలలో సీసీ రోడ్లు, అంతర్గత మురుగు కాల్వలు, వీధిదీపాలు, బస్టాండ్, 30 పడకల ఆసుపత్రి, జూనియర్ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, గిరిజన సేవా సంఘంరాష్ట్ర అధ్యక్షుడు హన్మనాయక్, పీఏసీఎస్ డైరెక్టర్ చేగూరి వెంకటేశ్, మాజీ స ర్పంచ్ వేణుగోపాల్, నాయకులు లక్ష్మయ్య, రాజేశ్, బ్ర హ్మచారి, చందోజీ, సత్యం యాదవ్, జహంగీర్‌అలీ, మ ల్లేశ్‌గౌడ్, జహంగీర్‌బాబా, రాంచందర్ నాయక్, బుచ్చయ్య, కృష్ణ, యాదగిరి రెడ్డి, మల్లయ్య, శ్రీను, రమేశ్, మూడ రవి, దేవేందర్‌గౌడ్, బోసు రవి, నరేశ్‌నాయక్, భా నుకిరణ్, ఇమ్రాన్ బాబా, వెంకటేశ్, మహేశ్, రాజేంద ర్‌గౌడ్, శ్రీకాంత్,మహేశ్, సందీప్, వినీల్‌నాయక్, శ్రీశైలం, లక్ష్మణ్, మల్లేశ్, జంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాయికంటి భిక్షపతి

కాంగ్రెస్‌కు కంచుకోటగా మహేశ్వరం

మహేశ్వరం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు పరుస్తున్న అనేక రకాల అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్శితులై బీజేపీ, బీఆర్ఎస్‌లకు చెందిన నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా కాంగ్రెస్‌లో చేరుతున్నారని, మహేశ్వరం ఆ పార్టీకి కంచుకోటగా మారుతోందని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి(కేఎల్లార్) అన్నారు. మాజీ మంత్రి, మహేశ్వరం ఎ మ్మెల్యే సబితాఇంద్రారెడ్డి ముఖ్య అనుచరుడు, బీఆర్ఎస్ మహేశ్వరం మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వ ర్కాల యాదగిరిగౌడ్ 50మంది అనుచరులతో మంగళవారం తుక్కుగూడలోని కాంగ్రెస్ కార్యాలయంలో కేఎల్లార్ సమక్షంలో హస్తం గూటికి చేరారు. ఈసందర్భంగా కేఎల్లార్ మాట్లాడుతూ అతి త్వరలో మహేశ్వరం నియోజకవర్గం మొత్తం కాంగ్రెస్ కంచుకోటగా మారనుందన్నారు. మునుపెన్నడూ లేనివిధంగా కేవలం రెండేళ్ల వ్యవధిలోనే ప్రభుత్వం అమలు పరుస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలకు ఆకర్శితులై ఇతర పార్టీల నా యకులు భారీగా కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటనుందన్నారు.



కేఎల్లార్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న యాదగిరిగౌడ్

బీఆర్ఎస్‌లో చేరిన మాజీ సర్పంచ్

చౌదరిగూడ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): జిల్లేడ్ చౌదరిగూడ మండలం రావిర్యాలకు చెందిన మాజీ సర్పంచ్ శివకుమార్ కాంగ్రెస్‌ను వీడి అనుచరులతో కలిసి షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. మంగళవారం ఆయనతో పాటు పలువురికి అంజయ్య యాదవ్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు హఫీజ్, నర్సింహులు, జహంగీర్, వెంకటేష్ వెంకటయ్య, భీమయ్య, నిజలింగం తదితరులు పాల్గొన్నారు



శివకుమార్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న అంజయ్య యాదవ్

పల్లెల్లో ప్రచార జోరు

(ఏడో పేజీ తరువాయి)

174 పంచాయతీలకు ఈ నెల 3 నుంచి నామినేషన్లు స్వీకరించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

విత్‌డ్రా చేసుకోవాలని బుజ్జగింపులు

ఆయా పంచాయతీల్లో పార్టీల మద్దతుదారులు ఒకరికి మించి సర్పంచ్ అభ్యర్థులు నామినేషన్లు వేయడంతో ఒకరికే పరిమితం చేసేందుకు పార్టీ నాయకులు బుజ్జగింపులు చేస్తున్నారు. పంచాయతీల్లో పట్టు నిలుపుకుంటేనే వచ్చే జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు మార్గం సుగమమవుతుందని భావిస్తున్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ మద్దతుదారులు నువ్వా.. నేనా అన్నట్లు తలపడుతున్నారు. ఈ పార్టీల్లో పోటీ ఎక్కువగా ఉన్నందున పార్టీ జిల్లా నాయకత్వం, స్థానిక ఎమ్మెల్యేలు రంగంలోకి దిగి ఇరు వర్గాలను కూర్చోబెట్టి నచ్చజెప్పే పనిలో ఉన్నారు. ఏదైనా ఉంటే మున్ముందు జరిగే జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో అవకాశం కల్పిస్తామని అవతలి పక్షానికి అవకాశం ఇవ్వకుండా పార్టీ భవిష్యత్ దృష్ట్యా నామినేషన్‌ను ఉపసంహరించుకోవాలని సలహా చేస్తున్నారు. గ్రామీణ ప్రాంత ఎన్నికలు కావడంతో సంస్థాగతంగా బీజేపీకి పట్టున్నచోట బలమైన అభ్యర్థులను రంగంలో దించుతోంది. సీపీఎం కూడా ఇబ్రహీంపట్నం డివిజన్‌లో పలు పంచాయతీలను చేజిక్కించుకోవడానికి అభ్యర్థుల వేటలో ఉంది.

దావత్‌లు షురూ..

పంచాయతీ ఎన్నికలకు ప్రచార సమయం కూడా తక్కువగా ఉన్నందున ఆయా పార్టీల మద్దతుదారులు రేయింబవళ్లు తిరుగుతూ ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు నానా తంటాలు పడుతున్నారు. యువజన సంఘాలకు బీరు, బిర్యానీ వంటి వాటితో దావత్‌లు షురూ చేశారు. పగలంతా ప్రచారం చేస్తూ మద్దతుదారులు చేజారకుండా రాత్రి కాగానే ఓ చోటకు చేర్చి వారికి మజా చేస్తున్నారు. గ్రామాల్లో మద్యం, మాంసానికి డిమాండ్ పెరిగింది. ఇలా ఓ అభ్యర్థి హంగామా చూసి మరో అభ్యర్థి చేతులు కాల్చుకోక తప్పడం లేదు. ఇబ్రహీంపట్నం పరిధిలో ఓ పంచాయతీ సర్పంచ్‌గా నామినేషన్ వేయనున్న ఓ అభ్యర్థి ఎంతకైనా రెడీ.. అంటూ అవసరమైతే ఎకరా భూమి అమ్మినా ఖర్చుకు వెనకాడేది లేదని ఇప్పటికే ప్రచారం చేసుకుంటున్నారు. ఉప్పరిగూడ పంచాయతీ ఎస్సీ మహిళకు రావడంతో ఇక్కడ కాంగ్రెస్, బీఆర్ఎస్ మద్దతుతో దాయాదులు రంగంలో దిగుతున్నారు. మూడు సార్లు బీజేపీ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీచేసిన చరిత్ర ఉన్న ఈ గ్రామంలో బీజేపీ బలమైన అభ్యర్థిని పోటీ పెట్టాలని చూస్తోంది. పోల్కంపల్లి పంచాయతీ జనరల్‌కు కేటాయించడంతో ఇక్కడ కాంగ్రెస్ బీసీ అభ్యర్థిని రంగంలో దించుతోంది. కాగా, పలు చోట్ల ప్రధాన పార్టీలు బలంగా ఉన్నప్పటికీ అభ్యర్థుల ఎంపిక విషయంలో కొన్ని ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి.

నిందితుడి బెయిల్ రద్దు

శంకర్‌పల్లి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): బెయిల్ షరతులు ఉల్లంఘించి, తిరిగి నేరాలకు పాల్పడిన నిందితుడికి చేవెళ్ల జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ న్యాయమూర్తి బెయిల్ రద్దు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 2023లో యడపల్లి రవి, అభిరాజ్ అనే వ్యక్తిని గాయపరిచిన కేసులో 2024లో శంకర్‌పల్లి పోలీసులు అరెస్టు చేశారు. కోర్టు 3నెలల అనంతరం రవికి షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. బయటకి వచ్చిన రవి నేర ప్రవృత్తిని మార్చుకోకుండా అత్యాచారం, మాదక ద్రవ్యాలు.. తదితర నేరాలకు పాల్పడ్డాడు. ఇప్పటి వరకు 8 కేసుల్లో నిందితుడిగా ఉండటంతో పోలీసులు రవిపై రౌడీషీట్ తెరిచారు. మంగళవారం నిందితుడిని కోర్టులో హాజరుపరుచగా ఇరువైపులా వివరాలు తెలుసుకున్న చేవెళ్ల న్యాయమూర్తి విజయ్‌కుమార్ ఉపాధ్యాయ బెయిల్ రద్దు చేయగా, పోలీసులు నిందుతుడిని రిమాండుకు తరలించారు.